

ఆప్కోస్‌లో చేర్చాలని డిప్యూటీ సిఎంకు వినతి

ప్రజాశక్తి - సాలూరు



రాజన్నదొరకు వినతిని అందజేస్తున్న 104 ఉద్యోగులు

తమను ఆప్కోస్‌లో చేర్చాలని కోరుతూ 104 సంచార వైద్యశాల వాహనాల డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆదివారం డిప్యూటీ సిఎం పి.రాజన్నదొరకు వినతి పత్రం అందజేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, సొంత గ్రామానికి బదిలీ అవకాశం కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్యామిలీ కాన్సెప్ట్ కార్యక్రమంలో 104 వాహనాల సిబ్బంది కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు.

జెసి ఆదేశాలు బేఖాతరు

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- ఐటిఐ నిర్మాణానికి భూములిచ్చేందుకు వెనుకంజ
- లెప్రసీ కాలనీ స్థలంపై బడాబాబుల కన్ను



ఐటిఐకి కేటాయించిన స్థలమిదే...

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐకి సొంత భవన నిర్మాణానికి గత 12ఏళ్లుగా తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదు. చాలీ చాలని అద్దె భవనంలో ఉన్న ప్రభుత్వ ఐటిఐ నిర్మాణానికి అవసరమైన భూమి కేటాయించాలని సంబంధించిన సంస్థ అధికారులు స్థానిక ప్రభుత్వ పెద్దలు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. గతంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన ఒ.ఆనంద్ ప్రభుత్వ ఐటిఐ నిర్మాణానికి భూమివ్వాలని స్థానిక తహశీల్దార్ రామస్వామిని ఆదేశించారు. దీనికోసం రెవెన్యూ సిబ్బంది ఎంపిడిఒ కార్యాలయం వెనుక ఉన్న లెప్రసీ కాలనీ స్థలాన్ని పరిశీలించారు. ఈ కాలనీలో సుమారు రెండు ఎకరాలకు పైగా భూమి ఖాళీగా ఉంది. కాలనీలో పది లెప్రసీ కుటుంబాలే నివసిస్తున్నాయి. కాలనీ పక్కన సర్వే నెంబర్ 216-1సిలో ఉన్న ఎకరా భూమిని ఐటిఐ నిర్మాణానికి కేటాయించాలని అప్పటి జెసి తహశీల్దార్‌ను ఆదేశించారు. ఈలోగా తహశీల్దార్ రామస్వామి అనారోగ్యం కారణంగా మూడు నెలలు సెలవు పెట్టారు. ఇంతలోనే ఆర్‌ఐ సంతోష్ అస్వస్థతకు గురయ్యారు. కొద్దిరోజుల క్రితం జెసి ఆనంద్ కూడా బదిలీపై వెళ్లిపోవడంతో ఈ వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది.

డిప్యూటీ సిఎం దృష్టికి వెళ్లిన స్థలవివాదం

ప్రభుత్వ ఐటిఐ అధికారులు స్థానిక డిప్యూటీ సిఎం రాజన్నదొరను భూమి కేటాయింపు విషయంలో అనేక సార్లు కలిశారు. ఇక్కడ ప్రభుత్వ ఐటిఐ మంజూరైన నాటి నుంచి ఆయనే ఎమ్మెల్యేగా ఉంటున్నారు. లెప్రసీ కాలనీ స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించిన విషయం ఐటిఐ అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. లెప్రసీ కాలనీ వాసులు కూడా రాజన్నదొరను కలిసి కాలనీ స్థలాన్ని ఐటిఐకి కేటాయించొద్దని డిమాండ్ చేశారు. అయితే దీన్ని ఆయన సున్నితంగా తిరస్కరించారు. ప్రభుత్వ అవసరాల కోసం కాలనీ స్థలాన్ని వినియోగించుకోవచ్చునని ఆయన బదులిచ్చారు.

తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్య అందిస్తున్న సంస్థ

ఈ ఐటిఐలో చదువుతున్న విద్యార్థులందరిలో ఎక్కువ మంది నియోజకవర్గానికి చెందిన వారే ఉన్నారు. ఉన్నత సాంకేతిక విద్య చదువుకునే స్తోమత లేక తక్కువ ఖర్చుతో సాంకేతిక విద్య చదువుకోవాలనే ఉద్దేశంతో నిరుపేద యువకులు ఐటిఐ కోర్సుల్లో చేరుతారు. సుమారు 300మంది పైగా విద్యార్థులు ఐటిఐలో చదువుతున్నారు. ఇప్పుడున్న అద్దె భవనం చాలా ఇరుగ్గా ఉండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రాక్టికల్స్ అధ్యయనానికి, వాటికి సంబంధించిన పరికరాల ఏర్పాటుకు సరిపడా వసతి లేకపోవడంతో 12ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాక్టికల్స్ నేర్పించేందుకు బొబ్బిలి ఐటిఐకి విద్యార్థులను పంపించాల్సి వస్తోంది. ఇన్ని ఎదుర్కొంటున్న విషయం డిప్యూటీ సిఎంకు తెలిసినా ఆయన ఉదాసీనత ప్రదర్శిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులపై ఒత్తిడి పెంచి ఐటిఐ నిర్మాణానికి భూమివ్వాలని ఆయన ఆదేశాలు జారీ చేయడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

లెప్రసీ కాలనీ స్థలం పై బడాబాబు కన్ను

ప్రభుత్వ ఐటిఐ నిర్మాణానికి లెప్రసీ కాలనీ స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించారు. నిర్మాణానికి అనువుగా ఉంటుందని భావించారు. అయితే ఈ కాలనీలో ఉన్న కొంతమంది లెప్రసీ రోగులు ఈ భూమి బదలాయింపుపై భగ్గుమంటున్నారు. లెప్రసీ కాలనీ నిర్మాణానికి అనేక దశాబ్దాల క్రితం కేటాయించిన భూమిని ఇతర అవసరాల కోసం ఇవ్వబోమని, కాలనీ అవసరాలకే వుండాలని డిమాండ్ చేస్తున్నారు. కానీ కాలనీలో ప్రస్తుతం ఉంటున్న లెప్రసీ రోగులకు ఈ భూమి బదలాయింపు వల్ల కలిగే ఇబ్బందులు ఏమీ లేవు. వారి నివాసాలకు ఆటంకం కూడా వుండదు. అయితే తమ సొంత భూమి అనే విధంగా వారు వాదిస్తూ ఐటిఐ నిర్మాణానికి అడ్డుపడుతున్నారు. రెవెన్యూ అధికారులు లెప్రసీ కాలనీ వాసుల వాదనలను పక్కన పెట్టి ఐటిఐ నిర్మాణానికి కేటాయించాలని నిర్ణయించారు. కానీ దీనికి సంబంధించిన ఫైలు ముందుకు కదలడం లేదు. స్థానిక రెవిన్యూ అధికారులు మొక్కుబడిగా దీన్ని తీసుకుని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు ఇలా వ్యవహరించడం, లెప్రసీ కాలనీ వాసులు అడ్డుపడుతున్న తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ స్థలంపై కన్నేసిన బడాబాబు ఒకరు ప్రభుత్వ ఐటిఐ నిర్మాణానికి ఈ భూమి కేటాయించొద్దని తెరవెనుక పావులు కదుపుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆ బడాబాబు ఒత్తిడి మేరకే రెవెన్యూ అధికారులు ముందుకు వెళ్లకుండా తాత్సారం చేస్తున్నట్లు తెలుస్తోంది.

సచివాలయాల సర్దుబాటుతో...

గర్భిణులకు తప్పని తిప్పలు

ప్రజాశక్తి - సీతంపేట

ప్రజల చెంతకు వైద్యసేవలందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇంటింటికీ కుటుంబ వైద్యుడు (ఫ్యామిలీ ఫిజిషియన్) అన్న కార్యక్రమాన్ని అట్టహాసరంగా ప్రారంభించింది. అయితే ఈ ఫ్యామిలీ ఫిజిషియన్ అనే కార్యక్రమానికి అవసరమైన ప్రత్యేక వైద్యులు, వాహనాలు లేకపోవడంతో ఆశించిన స్థాయిలో ఫలితాలు కానరావడంలేదు. అంతేకాక సచివాలయాల సర్దుబాటు సక్రమంగా లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లలేక రోగులు, గర్భిణులు అవస్థలు పడుతున్నారు. దీంతో ఈ కార్యక్రమానికి పురిటిలోనే బాలారిష్టలు మొదలయ్యాయి.

మండలంలో 31 సచివాలయాలు, మర్రిపాడు, ధోనుభాయి, కుసిమి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఒక్కొక్క పిహెచ్‌సికి ఒక్కొక్క ఫ్యామిలీ ఫిజీషియన్ వాహనం ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అంతవరకు బాగానే ఉంది. అయితే వీటిలో ఒక్కొక్క (ఫ్యామిలీ ఫిజీషియన్ వాహనానికి సమానంగా సచివాలయాలు ఉండాలనే ఉద్దేశంతో సర్దుబాటు కార్యక్రమం చేపట్టారు. వీటిలో ధోనుబాయికి 12, మర్రిపాడు 8, కుసిమి 11 సచివాలయాలు సర్దుబాటు చేశారు. అంతవరకు బాగానే ఉంది. ఈ సర్దుబాటులో మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పూతికవలస, మర్రిపాడు, కొండాడ, టిటికిపాయి, సామరెల్లి, కిల్లాడ, ధారపాడు సచివాలయాలు కేటాయించారు. ఈ పిహెచ్‌సికి సమీపానున్న హడ్డుబంగి, సొమగండి సచివాలయాలను పక్క మండలమైన భామిని పిహెచ్‌సికి కేటాయించారు. అలాగే భామిని మండలంలోని బాలేరు పిహెచ్సిలో పరిధిలోకి సీతంపేట ఒకటి, రెండు, సచివాలయాలతో పాటు గొయిది, పులి పుట్టి, సచివాలయాలను కేటాయించారు. అలాగే సీతంపేట మండలం కుసిమి పిహెచ్‌సి పరిధిలో పాలకొండ మండలం ఓని, లుంబూరు, వెలగవాడ సచివాలయాలు కేటాయించారు. ధోనుబాయి పిహెచ్‌సి పరిధిలోకి కుసిమి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న కోతాం, కుడ్డపల్లి, మండ, వీరగొట్టం మండలం చిన్నగోర సచివాలయాలను దోనుబాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేశారు.రు. దీంతో గర్భిణీలు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఈ కేటాయింపుల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ వాహనానికి సచివాలయాలు సర్దుబాటు చేసినప్పటికీ ఈ దగ్గర్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వదిలేసి 10, 15కిలోమీటర్ల ఆరోగ్య తనిఖీలకు తీసుకెళ్లాలి. అంతేకాక ప్రసవాలకు కూడా ఆ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకే వెళ్లాలి. ప్రత్యేకంగా ఏ రోగమొచ్చినా, రక్తం కొరత ఉన్నా పొరుగు మండలంలోని పిహెచ్‌సిలకు పరుగులు తీయాలి. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు.

వైద్యం కోసం పొరుగు పిహెచ్‌సిలకు...
ఫ్యామిలీ ఫిజిషియన్‌కు బాలారిష్టాలు




ఆరుబయటే వైద్యసేవలందిస్తున్న వైద్యులు

ఫ్యామిలీ ఫిజిషియన్‌కు బాలారిష్టాలు

మండలానికి ఒక వాహనం ఇస్తే, మరికొన్ని మండలాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఒక్కొక్క వాహనం ఇచ్చారు. అయితే ఫ్యామిలీ ఫిజిషియన్ వాహనం ఒక్కొక్క సచివాలయానికి రెండుసార్లు నెలలో తనిఖీ చేయాలి. నెలకు 26 రోజులు పని చేయాలి. అంతేకాకుండా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇద్దరు వైద్యాధికారులు ఉన్నప్పటికీ ఒక వైద్య అధికారి ఫ్యామిలీ ఫిజిషియన్ వాహనం ద్వారా వెళ్తే మరో వైద్యాధికారి ఫీల్డ్ విజిట్ లేక సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలి. లేకుంటే ఓపి చూడాలి. కావున ఫ్యామిలీ ఫిజిషియన్‌కు ఒక ప్రత్యేక డాక్టర్ కేటాయిస్తే బాగుంటుందని గిరిజనులు కోరుతున్నారు. అంతేకాకుండా విలేజ్ వెల్నెస్ సెంటర్లు పూర్తి కాకపోవడంతో వాహనం ద్వారా వెళ్లే వైద్యులకు తాగునీరు, మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అంతేకాక చెట్లు కింద వైద్యతనిఖీలు చేయాల్సి వస్తోందని చెబుతున్నారు.

ఈ విషయమై డిఎంహెచ్‌ఒ బి.జగన్నాధరావు వద్ద ప్రస్తావించగా ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ లో గవర్నమెంట్ మ్యాపింగ్ చేసింది. కొన్ని మండలాల్లో ఆ మండలంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సర్దుబాటు చేశామని తెలిపారు.



ఎమ్మెల్యే జోగారావుకు వినతిని అందజేస్తున్న ఉద్యోగులు

ఉద్యోగుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర మూడో దశ కార్యాచరణలో భాగంగా "ఉద్యోగుల ఆవేదన చెబుదాం" అనే కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎపి జెఎసి అమరావతి పార్వతీపురం మన్యం జిల్లా కార్యవర్గ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావును ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా ప్రయత్నించాలని కోరారు. ఈ మేరకు వినతి అందించారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వ ఉద్యోగులు పాలనలో ఒక భాగమని, వారిని రక్షించుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, తప్పకుండా వారి సమస్యలు పరిష్కారం అయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. కార్యక్రమంలో జెఎసి జిల్లా చైర్మన్ గొట్టాపు శ్రీరామ్మూర్తి, అసోసియేట్ చైర్మన్ మరిపి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ కెవి భవాని, రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు ఎ.సూర్యనారాయణ, పి.ఎస్.ఎల్.కుమార్, బి.శివరామకష్ణ, ఎం.రమణ మూర్తి, హెచ్‌ఎం అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, పిడిటి ఉద్యోగులు జి.శ్రీనివాసరావు, ఎం.సుధ, ఆర్.ఎస్.వి.రావు, పి.ఎస్.నారాయణ, బిడిపి రావు, బి.ఆనంద్, ఆర్‌ఎస్ సాహు, కె.కె.గౌరి, డి.ఎస్.చలం, విశ్రాంత ఉద్యోగులు, గొర్లె అప్పలరాజు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నేడు ధర్నా

ప్రజాశక్తి - కొమరాడ

ఉపాధిహామీ పథకం వేతనదారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం పార్వతీపునం మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా జరుగుతుందని, కావున ఈ ధర్నాలో వేతనదారులంతా పాల్గొని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివున్నాయుడు, సిఐటియు నాయకులు కె.సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు కొమరాడలో ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నిరుద్యోగ యువతీ యువకులు డిగ్రీలు, పీజీలు చేసిన వారు కూడా ఉపాధి పనుల్లో పాల్గొంతున్నారని, ఇంత కీలకమైన ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రపన్నుతున్నాయని అన్నారు. ఇందులో భాగంగా కూలీలను ఇబ్బందులకు గురిచేసి సమస్యలను సృష్టిస్తున్నారన్నారు. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని కోరుతూ తలపెట్టిన ధర్నాలో వేతనదారులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

'అభివృద్ధిపై డిప్యూటీ సిఎం రాజకీయం చేయరు'

ప్రజాశక్తి -సాలూరు

నియోజకవర్గంలో అభివృద్ధి పనుల విషయంలో డిప్యూటీ సిఎం రాజన్నదొర ఎలాంటి రాజకీయాలు చేయరని జగనన్న సచివాలయాల కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్లు గొర్లి వెంకటరమణ, మాధవరావు, పి.లక్ష్మణరావు చెప్పారు. ఆదివారం వారు స్థానిక రామా థియేటర్‌లో విలేకరుల తో మాట్లాడుతూ మండలంలో గిరిజనులకు మేలు చేయాలనే ఉద్దేశంతో రాజన్నదొర సెటిలర్లపై మాట్లాడారని చెప్పారు. కానీ టిడిపి నాయకులు అభివృద్ధి పనులకు ఆటంకం కల్పిస్తూ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సెటిలర్లను రెచ్చ కొట్టేలా ప్రతిపక్ష పార్టీ నాయకులు వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు బాలాజీ, బద్రి ఉన్నారు.

బిజెపికి సరైన గుణపాఠం

ప్రజాశక్తి -విజయనగరంకోట

కర్ణాటక ప్రజలు బిజెపికి సరైన గుణపాఠం చెప్పారని ఎపిసిసి మైనార్టీ విభాగం వైస్ చైర్మన్ ఎమ్‌డి హుస్సేన్ షరీఫ్ తెలిపారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్ణాటక ఎన్నికల్లో 15 మంది ముస్లిములు ఎమ్మెల్యేలుగా గెలవడం సంతోషంగా ఉందన్నారు. హిజాబ్ గురించి బిజెపి ప్రభుత్వం చేసిన ఘర్షణలకు, 4 శాతం రిజర్వేషన్ ఎత్తివేస్తానని చెప్పడం వల్ల ప్రజలు కాషాయ పార్టీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పారని తెలిపారు. మతతత్వ పార్టీని, మోడీ, అమిత్‌షాను ప్రజలు కర్ణాటక నుంచి తరిమికొట్టారన్నారు. ఇకపై దేశంలో ప్రతి రాష్ట్రంలోనూ ఇలాగే బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు.

సంక్షేమ పథకాలకు అర్హతే ప్రామాణికం

'ప్రజాశక్తి'తో గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ప్రత్యేక అధికారి కె.రామచంద్రరావు ముఖాముఖి



అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడమే గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేకత అని గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా ప్రత్యేకాధికారి కె.రామచంద్రరావు అన్నారు. సచివాలయాల ద్వారా 534 సేవలను ప్రజలకు అందజేస్తున్నామని, కావున వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి పనికి మండల కార్యాలయాలకు వెళ్లకుండా తమ గ్రామంలోనే సమస్యలను పరిష్కరించుకొనేందుకు సచివాయాల సేవలను వినియోగించుకోవాలని అన్నారు. సచివాయాలు మరింత సమర్ధవంతంగా పనిచేసేందుకు మోనిటరింగ్ టీంను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ టీం ద్వారా సచివాలయ సేవలను మెరుగుపర్చి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. వీటితో పాటు మరిన్ని విషయాలను ఆయన తెలిపారు. ఆయన మాటల్లోనే....

-ప్రజాశక్తి కలెక్టరేట్

☞ గ్రామ వార్డు సచివాలయల ప్రత్యేకత ఏమిటి?

ప్రజలందరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా, సత్వరంగా అందజేయడం ప్రత్యేక. అలాగే ప్రభుత్వం అందించే సేవలు అవినీతికి తావు లేకుండా, సంక్షేమ పథకాలకు అర్హత ఒక్కటే ప్రామాణికంగా ప్రజలందరికీ చేరువుగా ప్రభుత్వ సేవలను, సంక్షేమ పథకాలను అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అందించడమే గ్రామ, వార్డు సచివాలయాల ప్రధాన ఉద్దేశం.

☞ జిల్లాలో ఎన్ని గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి?

జిల్లాలోని 15 మండలాలు, మూడు మున్సిపాలిటీలకు కలిపి 350 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఇందులో 312 గ్రామ వార్డు సచివాలయాలు గ్రామీణ ప్రాంతాల్లోనూ, 38 వార్డు సచివాలయాలు పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయి.

☞ వీటిలో ఎంతమంది పనిచేస్తున్నారు?


జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల్లో 3293 మంది ఉద్యోగులు సేవలు అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న సచివాలయాల్లో 11 విభాగాలకు సంబంధించిన సచివాలయ సిబ్బంది పని చేయగా, పట్టణ ప్రాంతంలోని సచివాలయాల్లో 10 విభాగాలకు సంబంధించిన సిబ్బంది సేవలు అందిస్తున్నారు. వీరితో పాటు 5,243 మంది గ్రామ, వాలంటీర్లు సచివాలయ సేవలందిస్తున్నారు.

☞ సచివాలయం ద్వారా ఏఏ సేవలందిస్తున్నారు?

గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా 543 సేవలందిస్తున్నాం. ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, జనన మరియు మరణ ధ్రువీకరణ పత్రాలు, వివాహ నమోదు పత్రం వంటి543 రకాల సేవలను ప్రజలకు సచివాలయాల ద్వారా అందిస్తున్నాం.

☞ సచివాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమం ప్రత్యేకత ఏమిటి?

సచివాలయాల్లో ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమానికి సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది అంతా హాజరవుతారు. ప్రజలకు ఏమైనా సమస్యలుంటే స్పందన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకుంటే సంబంధిత అధికారులు వారి సమస్యలను



పరిష్కరించడం జరుగుతుంది.

☞ సచివాలయాల పనితీరు మెరుగుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఇప్పటికే సచివాలయ సిబ్బంది ప్రభుత్వ సంక్షేమ పథకాలను, ప్రభుత్వ సేవలను ప్రజలకు తగిన సమయంలోనే అందించేందుకు కృషి చేస్తున్నారు. సచివాలయాల పనితీరు మెరుగుకు మోనిటరింగ్ టీం ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ మానిటరింగ్ టీం ద్వారా సచివాలయ సేవలను మెరుగుపర్చి, ప్రజలకు మెరుగైన సేవలందించడంలో ఎంతో ఉపయోగపడుతుంది.



గొడుగు నీడలో వస్తున్న యువకులు

ఉక్కిరిబిక్కిరి

ప్రజాశక్తి - కురుపాం

గత కొద్ది రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. మండుటెండలకు తోడు వేసవి వడగాలులు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఈ స్థాయిలో ఎండలను ఎన్నడూ చూడలేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. గాలిలో తేమ శాతం కూడా పెరుగుతున్నందున తట్టుకోలేనంతగా అలముకుంటోంది. గత రెండ్రోజులుగా ఎండలు మరింత తీవ్రమయ్యాయి. చీకటి పడినా వాతావరణం చల్లబడే పరిస్థితి కనిపించడంలేదు. దీంతో నిత్యం జన సమ్మర్ధంగా ఉండే నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో అదివారం ఉదయం 12 గంటలకే 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో రోడ్డు నిర్మాను ష్యంగా దర్శనమిచ్చాయి. ప్రధాన రోడ్లు కర్ఫ్యూను తలపించాయి. ఎండ వేడిమి నుంచి ఉపశమనానికి టోపీలు పెట్టుకుని, గొడుగులు వేసుకొని బయటకు వస్తున్నారు. ద్విచక్ర వాహనం, ఇతర వాహనాల్లో ప్రయాణించే వారు సైతం తగు జాగ్రత్తలు తీసుకుంటేగానీ కాలు బయట పెట్టని పరిస్థితి ఉంది. అయినప్పటికీ ఎండలు ప్రజలు అల్లాడి స్తూనే ఉన్నాయి. ఇళ్లల్లోని గోడలు, వస్తువులతో పాటు నీడలో ఉన్నప్పటికి శరీరంపై ఉన్న ఇంకా ఇంట్లో ఉన్న వస్తువులు, బట్టలు సైతం వేడెక్కి పోతున్నాయి. వేసవి నుంచి ఉపశమనానికి పండ్లరసాలు, కొబ్బరి నీళ్లు మజ్జిగ, చెరుకు రసం వంటివి తీసుకుంటున్నప్పటికీ వెనువెంటనే గొంతు తడారిపోయే పరిస్థితి ఉంది. మండుటెండల దెబ్బకు చిన్నపిల్లలు, వృద్ధులతో పాటు రోగులు ఉక్కిరి బిక్కిరై పోతున్నారు. అగ్నికర్తెలు మొదటి రోజుల్లో పరిస్థితి ఇలా ఉంటే మున్ముందు మండుటెండలు ఇంకెంత ఇబ్బందికరంగా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

జాగ్రత్తలు తప్పని సరి

ఎండా కాలంలో ప్రతిఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు సాధ్యమైనంత వరకూ ఇళ్ల నుంచి బయటకు రాకూడదు. మిగిలిన వారు సైతం అత్యవసరమనుకుంటే ఉదయం 8 గంటల్లోపు, సాయంత్రం 5 గంటల తర్వాత బయటకు వెళ్లడం మంచిది. గొంతెండి వడదెబ్బకు గురికాకుండా ఎప్పటికప్పుడు మంచినీరు, పండ్ల రసాలు, కొబ్బరిబొండాలు వంటివి తీసుకోవడం మంచిది. పకోడీ, సమోసా, వేపుళ్లు వంటి వాటికి దూరంగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ఆకుకూరలు తినాలి. ఎండల తీవ్రత దృష్ట్యా బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ, కళ్లద్దాల రక్షణ అవసరం.

డాక్టర్ కె.సందీప్ కుమార్
చిన్నపిల్లల వైద్య నిపుణులు, కురుపాం సి హెచ్ సి.



ఎండతో బోసిపోయిన కురుపాం మెయిన్‌రోడ్డు



గిరిజన తల్లులకు చీరలు అందజేస్తున్న బ్రహ్మకుమారీ ప్రతినిధి, నీడ్ సంస్థ డైరెక్టర్

చీరలు పంపిణీ

నీడ్ ఆధ్వర్యాన మాతృ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - సాలూరు

మాతృ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక వైటిసి గిరిజన గర్భిణుల హాస్టల్‌లో నీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన మాతృదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన ఈశ్వరీయ బ్రహ్మకుమారీ విద్యాలయం ప్రతినిధులు కాబోయే గిరిజన తల్లులకు ఉచితంగా చీరలు, పసుపు, కుంకుమ అందజేశారు. గిరిజన గర్భిణులకు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రతి మనిషికీ తల్లి మొదటి గురువని చెప్పారు. కుటుంబ వ్యవస్థలో అమ్మ గొప్పతనం వెలకట్టలేనిదన్నారు. తన బిడ్డల ఔన్నత్యం కోసం ఎన్నో త్యాగాలు చేయడానికి సిద్ధపడే వ్యక్తి అమ్మ అని అన్నారు. కార్యక్రమంలో వైటిసి సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలో ఆదివారం మాతృ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తెలుగు బాప్టిస్ట్ దేవాలయంలో పాస్టర్ పి.విన్స్ కుమార్ తల్లులు ఆరోగ్యవంతులుగా ఉండాలని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా తల్లులకు, పిల్లలు పాదాభివందనం చేశారు.



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

పాలకొండ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఏడో రోజు తంపటాపల్లిలో డ్రాయింగ్ మాస్టర్ గొర్లె మురళి పాల్గొన్నారు. మాతృత్వ దినోత్సవం సందర్భంగా డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. తల్లి ముఖ చిత్రం చూసి వేయడం, ఆ తర్వాత రంగులు వేయించారు. ఈ పోటీలు సుమారు పిల్లలు 21 మంది విద్యార్థి, విద్యార్థినులు పాల్గొన్నారు. విజేతలకు వచ్చే ఆదివారం బహుమతులు అందజేయనున్నారు. ఇంఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

వీరఘట్టం : చదువుపై ప్రతి ఒక్కరికి పట్టుదల ఉండాలని స్థానిక గ్రంథాలయ అధికారి ఎం వెంకటేశ్వరరావు విద్యార్థులకు సూచించారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సమయంలో అల్లరి ఆటలకు స్వస్తి పలికి జ్ఞానాన్ని పెంపొందించేందుకు క్రమము తప్పకుండా వేసవి శిబిరానికి రావాలని సూచించారు. అనంతరం చిత్రలేఖన పోటీలను నిర్వహించారు.

17న రౌండ్ టేబుల్ సమావేశం

పార్వతీపురంటౌన్ : దళితుల హక్కుల సాధన కోసం, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఈనెల 17న స్థానిక ఎన్‌జిఒ హోంలో జరుగు రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుజ్జ జనార్ధన, ఎన్.సింహాచలం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం సమితి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలైన అంటరానితనం, గ్రామ బహిష్కరణ, అభివృద్ధిలో వెనుకబడిపోవడం, దళిత యువతీ యువకులపై దాడులు, వారిని ఉద్యోగాలకు ప్రోత్సహించకపోవడం, దళిత ఉద్యోగులపై దాడులు, హత్యలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులపై, అన్యాయంపై కూలంకుషంగా చర్చించి, భవిష్యత్తు దళిత ఉద్యమానికి బాటలు వేసేలా ఈ సమావేశంలో చర్చించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో దళిత పెద్దలు, దళిత ఉద్యోగులు, అన్ని రాజకీయ పార్టీ నాయకులు, ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొని తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గరుగుబిల్లి సూరయ్య, పువ్వల ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

సీతానగరం : మండలంలోని బూర్జ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాల్లో సోమవారం ఉదయం తొమ్మిది నుంచి ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఎఇ సోమేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ 33 కెవి మరమ్మతు పనులు జరుగుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, కావున వినియోగదారులు గమనించగలరు కోరారు.



చెరువులా మారిన ఘసి-తెలగవీధికి వెళ్లే రోడ్డు

ఇలా ఉంటే నడిచేదెలా..?

వీరఘట్టం : మండల కేంద్రంలోని ఘసి- తెలగవీధులకు వెళ్లే ప్రధాన రహదారి మధ్య మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో ఇలా ఉంటే నడిచేది ఎలా అంటూ స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి నీరు వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో రహదారిపైనే మురుగునీరు నిలిచిపోయింది. గతంలో ఈ రహదారికి ఆనుకొని చిన్న చెరువు ఉండేది. ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు చేపట్టేందుకు చెరువును పూడ్చి వేయడంతో ఈ నీరు వెళ్లేందుకు మార్గం లేక రహదారిపైనే ఉండి పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో పాదసార్లు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్తున్న పర్యాటకులు

ఉల్లాసంగా...ఉత్సాహంగా...

సీతంపేట : స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కు పర్యాటకులతో కళకళలాడింది. వేసవి సెలవులతో పాటు ఆదివారం కావడంతో పర్యాటకులు పార్కులో సందడి చేశారు. పార్కును సందర్శించడానికి జిల్లా నలుమూలల నుండే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పర్యాటకులు తరలివచ్చారు. పార్క్‌లోని అందాలను ఆస్వాదించారు. జల విహార్ వద్ద బోటు షికారు చేశారు. హ్యాంగింగ్ బ్రిడ్జిపై యువతీ యువకులు నడిచి వెళ్లారు. చిన్నారులు బుల్లి ట్రైన్ వద్ద ఆడుకున్నారు. ఆల్ట్రన్ వెహికల్ పార్కును చుట్టుముట్టారు. సాహసోపితమైన క్రీడల్లో దూసుకుపోయారు. ఆనంద విహార వద్ద డాన్సులు వేసి ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. అనంతరం మెట్టుగూడ జలపాతం వద్ద జలకాలాడేరు.

వినియోగంలోకి మహిళా పార్కు

విజయనగరం టౌన్: నగరంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మహిళా పార్కును ఆదివారం నుంచి పూర్తిస్థాయిలో మహిళలకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ప్రకటించారు. ఆదివారం సాయంత్రం మహిళా పార్కు చుట్టూ కలియతిరిగి, స్వచ్ఛంద సంస్థల మహిళా ప్రతినిధులకు పార్కులో ఉన్న వివరాలను వారు వివరించారు. స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలించారు. అనంతరం మీడియాతో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో తొలి మహిళా పార్కుగా ప్రకాశం పార్కును డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తీర్చిదిద్దారని కొనియా డారు. మహిళా పార్కు ప్రతిరోజూ ఉదయం 5 నుంచి 9 వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉంటుందని చెప్పారు. ఐదేళ్లలోపు పిల్లలకూ ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు. కేవలం మహిళలు మాత్రమే పార్కులోకి ప్రవేశించేలా ఏర్పాట్లు చేశామన్నారు..

ప్రకాశ్‌రావు మాస్టర్ మృతి

రామభద్రపురం: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, గ్రామాల్లో సుమారు 130 గాంధీజీ విగ్రహాలు ప్రతిష్టించిన కొట్టక్కి గ్రామానికి చెందిన పివిఎస్ ప్రకాష్‌రావు మాస్టర్ (82) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఎన్నో వేల మందికి చక్కని విద్యా బోధన చేసి ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దిన ఘనత ఈయనకే దక్కుతుంది. స్వాతంత్ర సమరయోధుల విజయ గాథలు నిరంతరం విద్యార్థులకు బోధిస్తూ గుర్తింపు పొందారు. ఈయన మృతి పట్ల గ్రామస్తులు, వైసిపి మహిళా నేత అప్పికొండ నిర్మల విచారం వ్యక్తం చేశారు.

తరలింపు సాధ్యమేనా..?

- ఒక్కొక్కటిగా మృత్యువాతపడుతున్న ఏనుగులు
- ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు

ప్రజాశక్తి - కొమరాడ

ఏనుగుల గుంపును జిల్లా నుంచి శాశ్వతంగా అటవీ ప్రాంతానికైనా, జూకైనా తరలించడం ప్రభుత్వానికి సాధ్యమేనేనని జిల్లా ప్రజల నుంచి విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఏడేళ్ల క్రితం జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపును తరలించేందుకు ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఈ ప్రాంత రైతులు, ప్రజలు భయాందోళనతో బిక్కుబిక్కుమంటూ జీవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏనుగుల తరలింపు మాట పక్కన పెడితే కనీసం ఏనుగులను రక్షించుకునే పరిస్థితిలో కూడా అధికారులు లేరనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇప్పటి వరకూ 11 ఏనుగులు మృత్యువాతపడ్డాయి.

జిల్లాలోకి ఏనుగుల గుంపు రావడం కొత్తేమీ కాదు. దశాబ్ద కాలంగా పార్వతీపురం మన్యం ప్రాంతంలో ఏడు ఏనుగులు సంచరిస్తూ పలువుర్ని బలితీసుకోగా, కోట్లాది రూపాయలు పంట నష్టం కూడా వాటిల్లింది. మరి కొన్ని సందర్భాల్లో ప్రమాదవశాత్తు ఏనుగులు కూడా మృతి చెందుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుంది. విద్యుత్ శాఖతో మన్యం జిల్లా భామిని మండలం కాట్రగడ్డ వద్ద ఇటీవల నాలుగు ఏనుగులు ఒకేసారి మృతి చెందిన ఘటన జిల్లాలోని తీవ్ర కలకలం సృష్టించాయి. గతంలోనూ ఏనుగులు విద్యుత్ షాక్‌తో పాటు వివిధ ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడ్డాయి. అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఏనుగులు మైదాన ప్రాంతాల్లో తిరుగుతూ మృత్యువాతపడుతున్నాయి తప్ప తరలింపునకు మాత్రం చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికే ఏనుగుల బారిన పడి 11మంది వరకు మృత్యువాతపడినట్లు



పంట పొలాల్లో సంచరిస్తున్న ఏనుగుల

అధికారులు లెక్కలు చెబుతున్నాయి. ఏనుగుల సంచారంతో వేల ఎకరాల పంటలకు నష్టం జరిగాయి. పదుల సంఖ్యలో మూగజీవాలు ఏనుగులు దాడిలో మృతి చెంది రైతులను ఆర్థికంగా నష్టపర్చాయి. ఏనుగుల తరలింపు ప్రక్రియ పక్కన పెడితే నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించడంలోనూ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

2007లో అప్పటి శ్రీకాకుళం జిల్లాలోకి విజయనగరం జిల్లా మీదుగా తొమ్మిది ఏనుగులు ప్రవేశించాయి. ఇవి పొరుగునే ఉన్న ఒడిశాలోని లకేరి అటవీ ప్రాంతం నుంచి తొలిసారి సీతంపేట మండలంలోకి ప్రవేశించాయి. 2017లో మరో ఎనిమిది ఏనుగుల గుంపు ఒడిశా నుంచి పార్వతీపురం మన్యం జిల్లాలోకి ప్రవేశించాయి. తాజాగా ఆరు నెలల క్రితం మరో ఏనుగులు గుంపు సీతంపేట మండలంలోకి ప్రవేశించాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో మూడు ఏనుగుల గుంపులు సంచరిస్తున్నాయి. 2018 ఏడాదిలో ఎనిమిది ఏనుగులు గుంపులో ఒక ఏనుగు విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. మరో ఏనుగు తోటపల్లి జలాశయం ముంపు ప్రాంతంలో మునిగిపోయి ఊపిరందక చనిపోయింది. మన్యం జిల్లాలోకి ప్రవేశించిన మూడు ఏనుగుల గుంపులు ఇప్పటి వరకు 11 ఏనుగులు ప్రమాదవశాత్తు మృతి చెందాయి. 11 ఏనుగుల మృతిపై అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణమని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా ఏనుగుల మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా ఏనుగులను శాశ్వతంగా అటవీ ప్రాంతానికి తరలించకపోతే భవిష్యత్తులో ఉన్న ఏనుగులు కూడా మృతి చెందే పరిస్థితి ఉందని చెబుతున్నారు. పగటిపూట ఎలిఫెంట్ ట్రాకర్లు ఏనుగుల వెనకాల కాపుల కాస్తున్నప్పటికీ రాత్రి సమయంలో వాటి జాడను ట్రాకర్లు కనిపెట్టలేకపోతున్నారు. అదే సమయంలో ఏనుగులు గుంపు ప్రమాదవశాత్తు మృతి చెందుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే ఏనుగుల తరలింపునకు చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో ఉన్న ఏనుగులు ప్రమాదవశాత్తు మృతి చెందే అవకాశం స్పష్టంగా కనిపిస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నేటి నుంచి ముంగారమ్మ జాతర

ప్రజాశక్తి - సాలూరురూరల్



మండలంలోని మామిడిపల్లిలో సోమవారం నుంచి బుధవారం వరకూ గ్రామదేవతైన ముంగారమ్మ పండగ జరగనుంది. ఈ మేరకు గ్రామంలో ఆదివారం నుంచి పండగ వాతావరణం నెలకొంది. దాదాపు 16 ఏళ్ల తర్వాత నిర్వహించనున్న ఈ పండగను ఘనంగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలు భారీ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా గ్రామమంతా విద్యుద్దీపాలంకరణలో మిరుమిట్లుగెల్పుతుంది. పంగడకు వచ్చే యాత్రికులు, బంధువుల కోసం సోమ, మంగళవారాలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. పండగ సందర్భంగా గ్రామంలో నిరంతరం మంచినీరు, విద్యుత్ సరఫరాలకు ఏర్పాటు చేశారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. విద్యుత్ అసౌకర్యం కలగకుండా గత వారం రోజుల నుంచి ఎఇ, నలుగురు లైన్మెన్లు ఏర్పాటు చేశారు. అదనంగా ఐదు ట్రాన్స్‌ఫార్మర్లను కూడా ఏర్పాటు చేశారు. తాగునీటి సదుపాయంలో భాగంగా నాలుగు మంచినీటి ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్నారు. పారిశుధ్య నిమిత్తం నాలుగు పంచాయతీల నుంచి 50మంది పారిశుధ్య కార్మికులను, సచివాలయ సిబ్బందిని అందుబాటులో ఉంచామని గ్రామ పెద్దలు బూస తవుడు, సువ్వాడ రామకృష్ణ, డొంక వెంకటరమణ తెలిపారు. అలాగే పండగ సందర్భంగా మండలంలో గ్రామంలో ఎటువంటి అసాంఘిక సంఘటనలు జరగకుండా సుమారు 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్టు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సింహాద్రి నాయుడు తెలిపారు. ఇప్పటికే గ్రామంలో 25మంది యువకులపై బైండోవర్ కేసులను పెట్టినట్టు ఆయన తెలిపారు.

మూలనపడ్డ 'మన పార్వతీపురం'

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మన పార్వతీపురం బోర్డు మూలన పడింది. గతంలో ఐటిడిఎ పిఒగా పనిచేసిన లక్ష్మీశ పార్వతీపురం పట్టణం బెలగాం అగ్రహారం వీధి ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో ఐటిడిఎ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేశారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి బెలగాం శివారు వరకు బస్‌స్టాప్ లేకపోవడం గుర్తించి ప్రయాణికుల సాకర్యార్థం ఐటిడిఎ కార్యాలయానికి కూతవేటు దూరంలో పెట్రోల్ బంకు పక్కనే గిరిజన ఉత్పత్తుల స్టాల్‌ను, అరకు కాఫీ స్టాల్‌ను, ఒక బస్సు స్టాప్ ఏర్పాటు చేశారు. పట్టణ సుందరీకరణలో భాగంగా ఈ బస్‌స్టాప్‌ను ఆనుకొని మన పార్వతీపురం అనే బోర్డును ఏర్పాటు చేశారు. పార్వతీపురానికి వచ్చే ప్రయాణికులతో పాటు, స్థానిక ప్రజలకు ఈ బోర్డు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతవరకు బాగానే ఉన్నప్పటికీ పార్వతీపురం మన్యం జిల్లా కొత్తగా ఏర్పాటైన తర్వాత కలెక్టరేట్‌కు నేరుగా కలెక్టర్‌తో పాటు, జిల్లా మంత్రులు,



వృథాగా మూలనపడేసిన మన పార్వతీపురం బోర్డు

ప్రజాప్రతినిధులు వెళ్లెందుకు కలెక్టరేట్ ప్రధాన ముఖ ద్వారం గేటు ఏర్పాటులో భాగంగా మన పార్వతీపురం బోర్డుతో పాటు బస్‌స్టాప్‌ను తొలగించారు. తొలగించిన మన పార్వతీపురం బోర్డును బెలగాంలోని మున్సిపల్ ప్రజారోగ్య శాఖ 2వ కార్యాలయం పక్కనే ఉన్న స్థలంలో పడవేశారు. కొత్త జిల్లా కేంద్రంలో ఆ బోర్డును ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టకపోవడం వారి నిర్లక్ష్యం నిలువెత్తున అద్దం పడుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ఈ బోర్డును ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టి మన పార్వతీపురం కీర్తిని ప్రతిష్టిచ్చేందుకు చర్యలు చేపట్టాలని పర్యావరణ ప్రేమికులు, స్థానిక ప్రజలు అధికారులకు సూచిస్తున్నారు.

లోకేష్‌కు సంఘీభావంగా నేడు పాదయాత్ర

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహిస్తున్న యువ గళం పాదయాత్రకు సంఘీభావంగా సోమవారం గరుగుబిల్లి మండలం తోటపల్లి నుంచి నాగూరు వరకు చేపట్టబోయే పాదయాత్రను జయప్రదం చేయాలని కురుపాం టిడిపి ఇంచార్జి తోయక జగదీశ్వరి కోరారు. మే 15 నాటికి లోకేష్ పాదయాత్ర వంద రోజులు పూర్తవుతున్న సందర్భంగా ప్రతి నియోజకవర్గంలో యువ నేతకు సంఘీభావంగా పార్టీ శ్రేణులు పాదయాత్ర చేయాలని ఆదేశాలు వచ్చాయన్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో ఐదు మండలాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలపాలని కోరారు.

సీతంపేట : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఈ నెల 15న 100రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా లోకేష్‌కు సంఘీభావం తెలుపుతూ సోమవారం పాలకొండలో పాదయాత్ర నిర్వహించనున్నట్టు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ తెలిపారు. ఈ పాదయాత్ర మధ్యాహ్నం 2.30గంటలకు వెలగవాడ సెంటర్ నుంచి చెక్ పోస్ట్ సెంటర్ (వీరఘట్టం) రోడ్ వరకు జరుగుతుందన్నారు. కావున ఈ పాదయాత్రలో పార్టీ నాయకులు, పెద్దలు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

అలరించిన గాత్ర కచేరీ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

హనుమత్ సందర్భంగా పట్టణంలోని కుసుమ గుడి వీధి శ్రీరామా యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభయాంజనేయ దేవాలయం ప్రాంగణంలో నిర్వహించిన గాత్ర కచేరి ఆహూతులను అలరించింది. విజయనగరానికి చెందిన సప్త స్వరాలయం వారిచే నిర్వహించబడిన శాస్త్రీయ సంగీత గాత్ర కచేరి శ్రోతలను ఎంతగానో ఆకట్టుకుంది. తమ్మిన రవికుమార్ వయోలిన్, సాహితీప్రియ మృదంగ సహకారంతో షణ్ముఖ ప్రియ ఆలపించిన కీర్తనలు ఆకట్టుకున్నాయి. శ్రీ రాగంలో ఎందరో మహానుభావులు ధన్యాసి రాగంలో సంగీత జ్ఞానం సిద్ధి వినాయక వేదములే నీ నివాసము వంటి అన్నమాచార్య కీర్తనలు ఎంతగానో అలరించాయి. ప్రదర్శన అనంతరం కళాకారులను శ్రీ రామా యువజన సంఘం సభ్యులు సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమాల్లో సత్యసాయి సేవా సమితి బాలవికాస కేంద్రం చిన్నారులు భక్తి గీతాలతో ఆకట్టుకోగా పట్టణానికి చెందిన రాజేష్ జ్యోషి హనుమాన్ చాలీసా వినిపించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన



గాత్ర కచేరీ చేస్తున్న సంగీత కళాకారులు

కార్యక్రమంలో పలు వీధులకు చెందిన భక్తులు హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు.

పాలకొండ రూరల్: మండలంలోని జి.వెంకటాపురంలో అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం హనుమజ్జయంతి శ్రీ గాయత్రీ ఉపాసకులు బంకుపల్లి ప్రసాదుబాబు ఆధ్వర్యంలో జరిగింది. ఆంజనేయస్వామికి ఉదయం నుండి సింధూరపూజ తమలార్చన ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆరవెల్లి మూర్తిబాబు, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు.

మతసామరస్యానికి ప్రతీక గుమ్మ లక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. కులమతాలు వేరు కావని మనుషులంతా ఒక్కటేనని చాటి చెబుతున్నారు. ఇందులో భాగంగా ఆదివారం హనుమాన్ జయంతి సందర్భంగా హిందూ, ముస్లిం, క్రైస్తవులు స్థానిక ఆంజనేయస్వామి దేవాలయం వద్ద సర్వమత ప్రార్థనలు చేస్తున్న దృశ్యమిది. గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బి. గౌరీశంకర్రావు, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వహీద్‌ఖాన్ మతసామరస్యానికి ప్రతీకగా పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్సీకి 104 సిబ్బంది వినతి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని 104 ఉద్యోగులు తమ జీత భత్యాలు, సేవలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని 104 ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోటారావు అధ్యక్షతన ఉద్యోగులు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుకి ఆదివారం బొడ్డవరలో వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా కోటారావు మాట్లాడుతూ 104 ఉద్యోగులుగా ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ద్వారా పేద ప్రజలకు సేవలు అందిస్తున్న ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇప్పించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, 2020 కరోనా కాలం నుంచి సుదూర ప్రాంతాలలో పని చేస్తున్న ఉద్యోగులకు, కొత్త 104 వాహనం సేవకు బదిలీలు కల్పించాలని కోరారు. ఉద్యోగులకు అరబిందో కంపెనీ యాజమాన్యం చెల్లించవలసిన ప్రావిడెంట్ ఫండ్ వాటా యాజమాన్యం వారే చెల్లించే విధంగా, ఐదు నుండి పది సంవత్సరాలు పూర్తయిన సీనియర్ డ్రైవర్లకి స్లాబ్ సిస్టం, జాయినింగ్ ఆర్డర్‌లో ప్రతి ఆరు నెలలుకి జీతాలు పెంచుతామని చెప్పిన విధంగా పెంచి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్సీ వారి సమస్యలను జిల్లా ఉన్నతాధికారులకు, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 104 సిబ్బంది రవీంద్రుడు, రమేష్, సత్యనారాయణ, నాయుడు, మహాలక్ష్మి, తులసి పాల్గొన్నారు.

జరజాపుపేటలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

నగరపంచాయతీ పరిధిలోని జరజాపుపేటకు చెందిన జూనియర్ లైన్‌మేన్ మద్దిల శివ జ్ఞాపకార్థం గ్రామంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 2010-11 పదో తరగతి పూర్వ విద్యార్థులు, రైజింగ్ స్టార్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు ప్రారంభించారు. దీనికి ముందు శివ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ ఈసి మెంబర్ పోలుబోతు దుర్గాప్రసాద్, పి ఆర్‌ఒ ముడిదాపు రాము, వైద్య సిబ్బంది పాల్గొని రక్త సేకరణ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన రైజింగ్ స్టార్స్ యూత్ సభ్యులను, వారికి సహకరించిన సాధన యువజన సంఘం సభ్యులను ఎమ్మెల్సీ సురేష్ బాబు అభినందించారు. కాగా శిబిరంలో రైజింగ్ స్టార్స్ యూత్ 65మంది రక్తదానం చేసి శివకి రక్తదానంతో శ్రద్ధాంజలి ఘటించారు. నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, గరివిడి ఎంఇఒ పోలుబోతు రామారావు, నాగవంశం డైరెక్టర్ మద్దిల వాసు, వైసిపి నాయకులు సుదర్శన్ బాబు, కౌన్సిలర్స్ అవనాపు సత్యనారాయణ, నాయకులు తుమ్ము నారాయణ మూర్తి, నల్లి శ్రీను, పోలుభోతు నారాయణ మూర్తి, ఎంఎం నాయుడు, మద్దిల శ్రీనివాసరావు, అవనాపు మురళీకృష్ణ, మద్దిల రాజారావు, పోస్ట్ మాస్టర్ పి.శ్రీనివాసరావు , తదితరులు పాల్గొన్నారు.

16న బొబ్బిలిలో ప్రజా ఛార్జిషీట్

బొబ్బిలి : బొబ్బిలిలో ఈ నెల 16న ప్రజా ఛార్జ్ షీట్ నిర్వహిస్తామని బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డి పావని, నియోజకవర్గ నాయకులు మరిశర్ల రామారావునాయుడు తెలిపారు. సాహితీ నగర్ బిజెపి కార్యాలయంలో ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా ప్రజా ఛార్జ్ షీట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యేలు, వైసిపి నాయకులు చేస్తున్న అక్రమాలు, భూకబ్జాలు, అవినీతిపై ప్రజా ఛార్జ్ షీట్ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు టి.హరి, జిల్లా కార్యదర్శి పి.మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంతాన సాఫల్య క్లినిక్ ప్రారంభం

విజయనగరం : నగరంలోని మఠం వీధి వద్ద సంతాన సాఫల్య క్లినిక్‌ను డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయనగరంలో ఇటువంటి క్లినిక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన లండన్ సంతాన సాఫల్య కేంద్ర డైరెక్టర్ కె. చంద్రారెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే విశాఖ, రాజమండ్రి, కాకినాడ ప్రాంతాల్లో తమ సంతాన సాఫల్య కేంద్రాలున్నాయన్నారు. తక్కువ ధరకే నాణ్యమైన చికిత్సలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం లో వైద్యులు డాక్టర్ బివి రవిచంద్ర, సన్యాసమ్మ, ఎం. సుధాకుమారి, విద్యావతి, పాల్గొన్నారు.

శిరికి గ్రీన్ సిటీని పరిశీలించిన నాయకులు

శృంగవరపుకోట: ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు ఈ నెల 18న శృంగవరపుకోట రానున్న నేపథ్యంలో ఆ రోజు రాత్రి బస చేయనున్న శిరికి గ్రీన్ సిటీని టిడిపి టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్ ఆదివారం పరిశీలించారు.

రైతు దగాకోరు చంద్రబాబే: ఎంపిపి

ప్రజాశక్తి- రామభద్రపురం

అధికారంలో ఉన్నన్నాళ్ళు రైతులను, ప్రజలను, గ్రామీణ ప్రాంతాలను దగా చేసిన దగాకోరు చంద్రబాబేనని ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు విమర్శించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీ చేస్తానని అధికారం దక్కించుకొని ఒకేసారి మాఫీ చేయకుండా చేతులు దులుపుకున్నారని ఎద్దేవా చేశారు. జగనన్న రైతు శ్రేయస్సుకై నిరంతరం శ్రమిస్తూ పారదర్శక సేవలు అందిస్తూ రైతు సేవలో ముందంజలో ఉన్నారన్నారు. టిడిపి నేతలు చేస్తున్న విమర్శలు అర్థరహితమని వారి హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత జగనన్న ప్రభుత్వంలో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పై చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. అన్ని గ్రామాల్లో పార్టీలకు అతీతంగా ప్రభుత్వం చేస్తున్న నవరత్నాల అమలుతో సుపరిపాలన అందుతుందని ప్రజలంతా సంతృప్తితో మెరుగైన జీవన భృతులు పొందుతున్నారని చెప్పారు. మొక్కజొన్న కొనుగోలుకు యంత్రాంగం సిద్ధంగా ఉందని చెప్పారు. రైతులు ఆరభికెలను సంప్రదించి తమ వద్ద ఉన్న మొక్క జొన్నను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అమ్ముకోవచ్చునన్నారు ఈ సమావేశంలో జెసిఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయల్, పార్టీ నాయకులు కనిమెరక అప్పారావు, దర్రు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రిజర్వాయర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-పాచిపెంట



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మండలంలోని పెద్దగెడ్డ రిజర్వాయర్‌లో ఆదివారం గుర్తు తెలియని మృత దేహం లభ్యమైంది. స్థానిక ఎస్ఐ ఎం.వెంకట రమణ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొటికి పెంట రేవు వద్ద మృతదేహం కనిపించింది. దీంతో స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని వెలికి తీశారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి సుమారు 30 ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. రేవు ఒడ్డుపై నలుపురంగు గుడ్డ, నీలం ప్యాంటు, లైట్ షర్టు ఉన్నాయి. స్నానానికి దిగి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు స్థానిక ఎస్ఐ వెంకటరమణ కేసు నమోదు చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

భార్యపై భర్త దాడి

ప్రజాశకి - పార్వతీపురం రూరల్

పట్టణంలోని వేమకోటి వీధికి చెందిన కొత్తాడ ఆదిలక్ష్మి అనే గృహిణపై ఆమె భర్త కృష్ణ పూటుగా మద్యం సేవించి దాడికి పాల్పడ్డాడు. కృష్ణ మద్యానికి బానిస కావడంతో ఇంటి ఖర్చులకు లేక తాను కాయకష్టం చేసి పిల్లల్ని పెంచాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో కోపోద్రిక్తుడైన కృషి ఆమె శనివారం రాత్రి ఆకస్మికంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. కుటుంబీకులు స్పందించి జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు ఔట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

యువతి అదృశ్యం

సాలూరు: పట్టణంలోని నెయ్యిల వీధికి చెందిన చలమల మీనాకుమారి (19) కనిపించడం లేదని ఆమె తండ్రి శ్రీనివాసరావు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు తెలిపారు.